ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతరావు

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, మే 12 : ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 56 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మండల స్పెషల్ అధికారులు గ్రామాల్లో తిరిగి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాల అర్హులైన లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఇండ్ల నిర్మాణం కోసం బేస్మెంట్ పూర్తయితే ప్రభుత్వం కట్టుబడికి లక్ష రూపాయలు వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. తదుపరి రెండు లక్షలు, జమ చేస్తుందని లబ్ధిదారులకు చెప్పాలని, ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉన్నందున అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు అయ్యేలా బ్యాంక్ అధికారులను ఒప్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించేందుకే రాజీవ్ యువ వికాసం

భువనగిరి అర్బన్, మే 12 : రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించాలనే రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టిందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, బ్యాంకర్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో సోమవారం కలెక్టరేట్‌లో జూమ్ మీటింగ్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి నిజమైన అర్హులకు రుణాలు అందించి ఆర్థికంగా బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. బ్యాంకుల ధ్రువీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుదారుల క్రెడిట్ నివేదికలను ధ్రువీకరించడంలో బ్యాంకులకు అవసరమైన సిబ్బందిని ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఎల్‌డీఎం కె.శివరామకృష్ణతో కలిసి భువనగిరి ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. బ్రాంచ్ మేనేజర్ అశోక్‌సాయిని ధ్రువీకరణ ప్రక్రియ అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

భూగర్భ జలాలను వృథా చేయవద్దు

నీటి వినియోగంపై అవగాహన పెంచుకుని భూగర్భ జలాలను ఎట్టి పరిస్థితుల్లో వృథా చేయరాదని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటిని భూమిలో ఇంకేలా సోక్ పిట్ నిర్మాణం తక్షణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వాల్టా చట్టాన్ని అమలు పరుచాలని, భూగర్భ జలాల వినియోగంపై ప్రజలకు అవగాహన పెంచాలని సూచించారు. బోరు వేసేందుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, వాల్టా చట్టాన్ని కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి అర్బన్, మే 12 : నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా పెట్టుకుని నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. జిల్లా వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో కృషి చేయాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ట్యూటర్లతో శిక్షణ ఇప్పించి నిరక్షరాస్యతను రూపుమాపాలని సూచించారు. జిల్లాలో సుమారు 99వేల మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు నివేదిక ఉన్నందున 21వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. ఉల్లాస్ యాప్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని, ఎన్ఐసీపీ కార్యాక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డీపీఓ సునంద, వయోజన విద్య ఉప సంచాలకులు మమత, డీఈఓ సత్యనారాయణ, ఉల్లాస్ జిల్లా సభ్యుడు కృష్ణారెడ్డి, రెడ్ క్రాస్ సభ్యుడు బాలాజీ, డీపీఎంలు పాల్గొన్నారు.

టూరిజం సెంటర్ సందర్శన

చేనేత కళాకారులతో మాట్లాడుతున్న చేనేత జౌలి శాఖ ఏడీ శ్రీనివాసరావు

భూదాన్ పోచంపల్లి, మే 12 : గ్రామీణ పర్యాటక కేంద్రమైన భూదాన్ పోచంపల్లిని చేనేత జౌలి శాఖ ఏడీ శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. టూరిజం సెంటర్‌లో వస్త్రాల తయారీ విధానం ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 15న పోచంపల్లికి మిస్ వరల్డ్ పోటీదారులు రానున్న నేపథ్యంలో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల విశిష్టత గురించి ఏ విధంగా వివరించాలో చేనేత మహిళకు సూచించారు. చేనేత వారసత్వ సంప్రదాయ కళా నైపుణ్యం అద్భుతమని అందరికీ వివరించాలన్నారు. అనంతరం ట్రాఫిక్ సీఐ మల్లారెడ్డి టూరిజం పార్కులోని హంపి థియేటర్, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై చౌటుప్పల్ సీఐ రాములు, ఎస్ఐ భాస్కర్ రెడ్డి వివరించారు.

ఆయన వెంట చేనేత జౌలి శాఖ డీఓ రాజేందర్‌రెడ్డి, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు, కార్మిక సంఘం ప్రతినిధులు భారత భూషణ్, శ్యాంసుందర్, దయానంద్, శ్రీనివాస్ ఉన్నారు.

క్షయ వ్యాధి నివారణలో సీవై - టీబీ పరీక్ష కీలకం

- టీబీ ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ సాయిశోభ

పీహెచ్‌సీలో సీవై-టీబీ పరీక్షను ప్రారంభిస్తున్న టీబీ ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ సాయిశోభ

యాదగిరిగుట్ట, మే 12 : క్షయ వ్యాధి నివారణలో సీవై-టీబీ పరీక్ష కీలక పాత్ర పోషిస్తుందని టీబీ ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ డాక్టర్ సాయిశోభ అన్నారు. జిల్లాలో తొలిసారిగా సీవై - టీబీ పరీక్షను పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీవై-టీబీ పరీక్షతో క్షయవ్యాధిని మరింత త్వరగా, కచ్చితంగా గుర్తించడం సాధ్యమవుతుందన్నారు. ఈ పరీక్షను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకు రావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. టీబీ నిర్మూలన దిశగా ఇది ఒక మైలురాయి కాబోతుందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ పావని, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు సన్మానం

రాజాపేట, మే 12 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, వివిధ కళాశాలల్లో ఇంటర్ చదివిన పలువురు గురిజన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. వారికి మండలంలోని పుట్టెగూడెంలో గ్రామ మాజీ సర్పంచ్ మాడోతు దేవీరాములునాయక్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతిలో పావని, శిరీష, మంజుల 500కు పైగా మార్కులు, ఇంటర్‌లో మాడోతు అనిల్‌నాయక్, పావని, నిహారిక 900కు పైగా మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ఉన్నత చదువుల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విఠల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనునాయక్, రంగ్యానాయక్, దేక్యానాయక్, రమేశ్, తులసీరామ్, రంగ్యానాయక్ పాల్గొన్నారు.

వీఓఏ సంధ్యను విధుల్లోకి తీసుకోవాలి

- యాదగిరిగుట్ట మహిళా సమాఖ్య భవనం వద్ద వీఓఏల సంఘం ధర్నా
- మైక్రో ఫైనాన్స్‌కు అడ్డుగా వస్తుందన్న అక్కసుతోనే నన్ను తొలగించారు
- బాధితురాలు సంధ్య

యాదగిరిగుట్ట ఐకేపీ భవనం వద్ద ధర్నా చేస్తున్న వీఓఏల సంఘం నాయకులు

యాదగిరిగుట్ట, మే 12 : రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అకారణంగా విధుల నుంచి తొలగించిన కాచారం వీఓఏ సంధ్యను విధుల్లోకి తీసుకోవాలని వీఓఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు తప్పుడు తీర్మానం చేసి ఆమెను సస్పెండ్ చేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారని తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య భవనం వద్ద వీఓఏల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు బొమ్మరపు అనూరాధ మాట్లాడుతూ గ్రామంలో వీఏఓ సంధ్య సంఘాల పర్యవేక్షణ సరిగాలేదంటూ ఎలాంటి ఆధారాలు లేకుండానే సంఘ బంధం సమావేశంలో కోరం లేకుండానే తప్పుడు తీర్మానాన్ని ఎలా పరిగణలోకి తీసుకున్నారని ఏపీఎం సుధాకర్‌ను నిలదీశారు. ఒకవేళ తీర్మానం వస్తే రూల్స్ ప్రకారం రెండు సార్లు నోటీసులు ఇచ్చిన తర్వాతే సస్పెండ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. నోటీసులు జారీ చేయకుండా విధుల నుంచి తొలగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సంఘాల పర్యవేక్షణ సరిగా చేయడం లేదన్న కారణంతో కోరం లేకుండానే చేసిన తీర్మానాన్ని ఆసరాగా చేసుకుని వీఓఏను సస్పెండ్ చేయడం సరైందికాదన్నారు. ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధితురాలు సంధ్య మాట్లాడుతూ 13 ఏండ్లుగా వీఓఏగా విధులు నిర్వర్తిస్తున్నానని, ఇప్పటి వరకు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పని చేశానని అన్నారు. కొన్ని నెలల క్రితం తన సమీప బంధువులకు చెందిన మైక్రోఫైనాన్స్‌కు అడ్డుగా వస్తుందని తనను తొలగించాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎడ్ల రామిరెడ్డి పథకం వేశాడని పేర్కొన్నారు. గ్రామాల్లో అధిక వడ్డీలు వసూలు చేస్తున్న మైక్రో ఫైనాన్స్ వద్ద రుణాలు తీసుకున్న మహిళా సంఘాలకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వవద్దని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలున్నాయని తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు తాను పని చేశానని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల సాకుతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వద్దకు మహిళా సంఘాల నాయకులను తీసుకెళ్లి తప్పుడు ఆరోపణలు సృష్టించి తనను సస్పెండ్ చేయాలని కోరారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, పథకాల మీద తప్పుడు ఆరోపణలు చేస్తోందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారన్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీతో విచారణ చేపట్టి తగు న్యాయం చేస్తామని కలెక్టర్ హామీనిచ్చినట్లు వారు వెల్లడించారు.

కొనుగోలు కేంద్రంలో తాసీల్దార్ విచారణ

- నమస్తే తెలంగాణ వార్తకు స్పందన
- సెంటర్ ఇన్‌చార్జి శిరీష తొలగింపు

పల్లెపహాడ్ కొనుగోలు కేంద్రంలో రైతుల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న తాసీల్దార్ లావణ్య

ఆత్మకూరు(ఎం), మే 12 : మండలంలోని పల్లెపహాడ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసం జరుగుతున్నట్లు రైతులు ఆరోపించిన వార్త సోమవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైంది. ఇందుకు వెంటనే స్పందించిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని తాసీల్దార్ లావణ్యను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 40కిలోల బస్తాకు గానూ 41కిలోల 200 గ్రాముల తూకం వేయడంతోపాటు లారీల్లో లోడ్ చేసేందుకు బస్తాకు రూ.4చొప్పున వసూలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పుడు తూకం వేసినా, అదనపు చార్జీలు వసూలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి లారీల సంఖ్యను పెంచి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కేంద్రం ఇన్‌చార్జి శిరీష తొలగింపు

నమస్తే తెలంగాణ వార్తకు స్పందించిన జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి మురళీధరణ్ ఆదేశాల మేరకు పల్లెపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి శిరీషను తొలగిస్తున్నట్లు డీసీఓ కార్యాలయం మానిటరింగ్ ఆఫీసర్ శ్యామ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

చౌటుప్పల్ రూరల్, మే 12 : మండలంలోని జైకేసారం గ్రామ పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామ పరిధిలో ఈ నెల 10న వలిగొండ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన పెద్దగోని రమేశ్ బైక్‌పై తన తల్లి అంజమ్మ(52)ను తీసుకొని చౌటుప్పల్ వైపు వెళ్తున్నాడు. జైకేసారం గ్రామం వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడటంతో అంజమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా సోమవారం మృతిచెందింది.

ధాన్యం తూకం పరిశీలన

మోత్కూరు, మే 12 : మండలంలోని దాచారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధులు కురిమేటి యాదయ్య, ఇటికాల లింగయ్యతో కలిసి ఏఓ కీర్తి, ఏఈఓ అశోక్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను, తూకాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయడం కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

విజయ్‌కుమార్‌కు ప్రొఫెసర్‌గా పదోన్నతి

ఆలేరు రూరల్, మే 12 : మండలంలోని శర్భనాపురం గ్రామానికి చెందిన డాక్టర్ కందుల విజయ్‌కుమార్‌కు ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. ప్రస్తుతం ఆయన ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసింది.

క్రికెట్ కిట్ అందజేత

ఆత్మకూరు(ఎం), మే 12 : మండల కేంద్రంలోని నేతాజీ యువజన మండలి క్రీడాకారులకు కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో అందజేసిన క్రికెట్ కిట్టును సోమవారం యువజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రతికంఠం శంతన్‌రాజ్, ఎలిమినేటి మురళీకృష్ణ క్రీడాకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన మండలి సభ్యులు కిరణ్, సుభాశ్, వినయ్, అభినయ్, రాజు పాల్గొన్నారు.

విక్రమ్‌రావు మృతికి సంతాపం

భువనగిరి అర్బన్, మే 12 : ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌రావు మృతికి టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో సంతాపం తెలిపారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కొలుపుల వివేకానంద, నాయకులు పేరబోయిన నర్సింహ, ముత్యాల జలంధర్ పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ భూములు దక్కేవరకు ఉద్యమాలు చేస్తాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

సదస్సులో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

చౌటుప్పల్, మే 12 : పేదలకు ప్రభుత్వ భూములు దక్కేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సోమవారం సీపీఎం నేత రొడ్డ అంజయ్య 3వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భూమి, ఉపాధి హామీ - పాలకుల వైఖరిపై నిర్వహించిన సదస్సులో జహంగీర్ మాట్లాడారు. ఇప్పటి వరకు ఎన్నో భూ పోరాటాలు చేపట్టామన్నారు. ఆనాడు ఎర్రజెండా నాయకత్వంలో భూస్వాముల నుంచి స్థలాలను గుంజి నిరుపేదలకు పంపిణీ చేశామని తెలిపారు. ప్రస్తుత పాలకులు మళ్లీ ఆ భూములను పరిశ్రమలు, వెంచర్లు, వ్యవసాయ క్షేత్రాల పేరుతో పోగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. భూములు సాగులో తేకపోతే ఎర్ర జెండాలు పాతి పేదలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ, జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, ఐద్వా జిల్లా కార్యదర్శి అనూరాధ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాషా, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కిష్టయ్య పాల్గొన్నారు

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి : పౌర హక్కుల సంఘం

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్

ఆలేరు టౌన్, మే 12 : ఆపరేషన్ కగార్‌ను ఆపి, శాంతి చర్చలు జరుపాలని రాష్ట్ర పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డ లక్ష్మణ్, సీపీఐ (ఎంఎల్) ఎన్‌డీఆర్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కోమటిరెడ్డి అనంతరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణంలో సీపీఐ (ఎంఎల్) ఎన్‌డీఆర్ రాష్ట్ర కమిటీ నాయకుడు పంగ రవి అధ్యక్షతన సోమవారం జరిగిన సభలో వారు మాట్లాడారు. అమాయకులైన ఆదివాసీలను, మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తూ బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని మధ్య భారతం అడవుల్లో భూమిలోని విలువైన ఖనిజ సంపదను తవ్వి తీసుకెళ్లడానికి కేంద్ర పాలకవర్గం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులతో ఒప్పందాలు చేసుకుందన్నారు. 40ఏండ్ల నుంచి ఆదివాసీలు ప్రతిఘటిస్తుంటే ఈ మధ్య కాలంలో పెట్టుబడిదారులతో ఒప్పందాలు చేసుకొని ఆపరేషన్ కగార్ పేరుతో మిలటరీ బలగాలతో ఆదివాసీలు, మావోయిస్టులను కాల్చి చంపారని విమర్శించారు. చర్చలు జరిపి ఎన్‌కౌంటర్లను ఆపాలని డిమాండ్ చేశారు. నాయకులు బట్టు రామచంద్రయ్య, చంద్రమౌళి, అంజయ్య, వరలక్ష్మి, మహేశ్, నాగయ్య, కిష్టయ్య, సీనియర్ పాత్రికేయుడు కుర్షీత్ పాషా, మల్లేశం పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి'

చౌటుప్పల్, మే 12 : దివ్యాంగుల హక్కుల సాధన, వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16, 17 తేదీల్లో చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి, ధర్నాను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ముట్టడి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు స్పెషల్ కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. సంఘం మండలాధ్యక్షుడు రాయగిరి యాదగిరి, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : కలెక్టర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ కోరారు. పట్టణంలో సోమవారం ముట్టడి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్‌పీఆర్‌డీ డివిజన్ అధ్యక్షుడు ఏర్పుల శివయ్య, మండలాధ్యక్షుడు ముదిగొండ రాములు, నాయకులు మంచాల మధు, దుబ్బాక జగన్, భిక్షపతి, శేఖర్, పద్మారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్, మే 12 : మండల వ్యాప్తంగా ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 15నుంచి 15రోజుల పాటు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గురువారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులను చౌటుప్పల్, తంగడపల్లి, కొయ్యలగూడెం, దండు మల్కాపురం తదితర జిల్లా పరిషత్ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరాల్లో యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్, ఇండోర్ గేమ్స్ (క్యారమ్, చెస్) డ్రాయింగ్‌పై తర్ఫీదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆలేరు టౌన్ : విద్యార్థులు టీవీలు, ఫోన్లతో కాలక్షేపం చేయకుండా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎర్ర లక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలేరు, కొలనుపాక, శారాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

బీబీనగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.ఇందిరా ప్రేమజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఉన్నట్లు తెలిపారు.

ఆత్మకూరు(ఎం) : వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కె.మహదేవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండోర్, ఔట్‌డోర్ క్రీడలు, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

బొమ్మలరామారం : జలాల్‌పూర్, బొమ్మలరామారం, మర్యాల, తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రోజారాణి తెలిపారు.

భక్తిభావాలను పెంపొందించుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



చిరుమర్తి లింగయ్య, క్యామ మల్లేశ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామన్నపేట, మే 12 : ప్రజలు భక్తిభావాలను పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన బీరప్పస్వామి, కామరతి అమ్మవారి కళ్యాణ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ కురుమ సంఘం నాయకులు తమ ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామి ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. బీరప్ప స్వామి దీవెనలతో అందరూ కలిసిమెలిసి సుఖసంతోషాలతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, నాయకులు అశోక్, నర్సింహ, సుధీర్‌బాబు, వెంకటేశం, ఉమారమేశ్, వెంకటేశ్, సంతోష్ పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి సేవలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం స్వామివారి కొండపైకి చేరుకున్న ఆయన స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

వృద్ధ దంపతులకు కలెక్టర్ సన్మానం